నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, బుధవారం 19 ఫిబ్రవరి 2025 | KARIMNAGAR

## 28 నుంచి ఎల్ఎల్బీ పరీక్షలు

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 18 : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని ఎల్ఎల్‌బీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 28వ తేదీ నుంచి మార్చి 5వ తేదీ వరకు నిర్వహిం చనున్నట్లు విశ్వవిద్యాలయ పరీక్షలు నియంత్రణ అధికారి శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తర వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూడవచ్చని సూచించారు.

## ఎంఈడీ ఫలితాలు విడుదల

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 18 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో 2024 నవంబర్‌లో నిర్వహించిన ఎంఈడీ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు యూనివర్సిటీ పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఎంఈడీ రెండో సెమిస్టర్, నాలుగో సెమిస్టర్ ఫలితాలు ఆన్‌లైన్, యూనివర్సిటీ వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. విద్యార్థులు మరిన్ని వివరాల కోసం http://103.119.113. 107:89, www.satavahana.ac.in లో చూడవచ్చని సూచించారు.

# స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి

### జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

రాయికల్, ఫిబ్రవరి18: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు సత్తా చాటేలా ప్రతి కార్యకర్తా కష్టపడాలని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సూచించారు. ఇటిక్యాల గ్రామంలో మంగళవారం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించగా, ఆమె హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలను ప్రజల పక్షాన ఎప్పటికప్పుడు ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఇటిక్యాల బీఆర్ఎస్ పార్టీకి ఆయువుపట్టుగా ఉందన్నారు. ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామని, ఎవరూ అధైర్యపడవద్దని సూచించారు. రానున్న రోజుల్లో పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.


మాట్లాడుతున్న జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

# అన్నదాత గుండెకోత

- చెరువు నింపకపోవడంతో నెర్రెలువారిన పొలం
- ఎండుతున్న పంటను చూడలేక కోసేసిన మహిళా రైతు సరోజ
- ఎల్లారెడ్డిపేట మండలంలో ఎండుతున్న పంటలు


- గొర్రెల మేతకు పొలాలు

మల్లాపూర్‌లో రైతు పాశం శ్రీనివాస్ పొలంలో మేస్తున్న గొర్రెలు

తిమ్మాపూర్, ఫిబ్రవరి18: ఎండకాలం రాకముందే తిమ్మాపూర్ మండలంలో సాగునీటి గోస మొదలైంది. తోటపల్లి రిజర్వాయర్ నుంచి డీ ఫోర్ కెనాల్ ద్వారా పలు గ్రామాలకు సాగునీరు రాక తండ్లాడాల్సి వస్తున్నది. మల్లాపూర్ లోయకుంట అడుగంటి పోయింది. సమీప బావులు, బోర్లు ఎత్తేశాయి. కోటి ఆశలతో వేసిన పొలాలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు కన్నీరు పెడుతున్నారు. చేసేదేమీలేక జీవాలకు మేతగా వదిలేస్తున్నారు. డీ ఫోర్ కాలువ నుంచి లోయకుంటకు నీళ్లు వెళ్లేందుకు గతంలో ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, ఓ కాంగ్రెస్ నాయకుడు పనులు చేశాడని, సరైన ప్రణాళిక లేకుండా చేయడంతో మధ్యలోనే నిలిచిపోయాయని విమర్శించారు. దీని వల్లే మల్లాపూర్ గ్రామానికి ఎద్దడి మొదలైందని మండిపడుతున్నారు. లోయకుంటలో నీళ్లుంటే గ్రామమంతా సస్యశ్యామలంగా ఉంటుందని, నింపకపోతే రాబోయే రోజుల్లో తాగునీటికి సైతం ఇబ్బందులు వచ్చే ప్రమాదముందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


గుంటపల్లిచెరువు తండాలో నెర్రెలు వారిన పొలంలో దీనంగా కూర్చున్న మహిళా రైతు సరోజ, కుటుంబసభ్యులు

.. ఇక్కడ నెర్రెలు వారిన పొలంలో కనిపిస్తున్న వారు నూనావత్ సరోజ, కుటుంబసభ్యులు. ఎల్లారెడ్డిపేట మండలం గుంటపల్లిచెరువు తండాకు చెందిన సరోజ. తనకున్న మూడున్నర ఎకరాలలో బోరు బావి ఆధారంగా పొలం వేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మల్కపేట కెనాల్ ద్వారా వచ్చిన నీటితో తిమ్మాపూర్ మైసమ్మ చెరువు నింపడం, దీని కిందనే ఉన్న సరోజకు చెందిన బోరు బావిలోకి పుష్కలమైన ఊట రావడంతో రెండు సీజన్లలో రందీ లేకుండా సాగు చేసింది. గుంట పొలం కూడా ఎండిపోనివ్వకుండా బంగారు పంటలు పండించింది. అయితే, ప్రస్తుతం మల్కపేట కాలువ ద్వారా నీళ్లు రాకపోవడంతో చెరువులో నీళ్లు అడుగంటి పోయాయి. దీంతో బోరుబావి మూడున్నర ఎకరాల పొలానికి నీరందించలేకపోతున్నది. ఫలితంగా ఇప్పటికే ఎకరం పొలం కళ్లముందే ఎండిపోగా, మిగతాది కూడా ఎండలు ముదిరితే చేతికి రాకుండా పోతుందని ఆవేదన చెందుతున్నది. ఎండిన పొలాన్ని చూడలేక ఇలా కోసి పశువులకు మేతకు వేస్తున్నది. మూడు నెలలు కష్టపడి సాగు చేస్తే ఇలా నీళ్లందక గుండె'కోత' మిగులుతుందని అనుకోలేదని కన్నీటి పర్యంతమవుతున్నది. ఇలా ఒక్క నూనావత్ సరోజనే కాదు, ఎల్లారెడ్డిపేట మండలంలోని రాజన్నపేట, తిమ్మాపూర్, అల్మాస్‌పూర్, దేవునిగుట్ట తండా, బాకుర్‌పల్లి కిష్టునాయక్ తండా రైతులు సాగునీటి కోసం తండ్లాడుతున్నారు. తమ పంటలను కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు.


- ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 18

# గేదెల పథకంలో గోల్ మాల్!

### కొనుగోలు లేదు.. పంపిణీ లేదు

- 2 మిల్చ్ ఆనిమల్ యూనిట్ పథకంలో దళారుల చేతివాటం
- లబ్ధిదారులకు వలవేసి దందా
- గేదెలు తీసుకొచ్చిన వాహనంలోనే వాపస్
- కండ్లముందే జరుగుతున్నా చోద్యం
- అధికారులపైనా ఆరోపణలు

పెద్దపల్లి, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ) : దళితుల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా గత బీఆర్ఎస్ సర్కారు '2 మిల్చ్ ఆనిమల్ యూనిట్' పథకాన్ని రూపొందించింది. షెడ్యూల్ క్యాస్ట్ యాక్షన్ ప్లాన్ (ఎస్సీఏపీ) 2020-21 పథకం కింద ఒక్కో ఎస్సీ కుటుంబానికి 2 గేదెలను అందిస్తే, ఆ కుటుంబం ఆర్థిక ప్రగతిని సాధిస్తుందని భావించింది. ఆ మేరకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఈ స్కీం ప్రారంభించింది. పెద్దపల్లి, సిరిసిల్ల, సిద్దిపేట, జనగాం, నాగర్‌కర్నూల్, సూర్యాపేట, జగిత్యాల జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేసింది. ఆ సమయంలో కొంత మేరకు గేదెల పంపిణీ జరిగింది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో నవ్వుల పాలవుతున్నది. పెద్దపల్లి జిల్లాలో డిసెంబర్ చివరి వారం నుంచి గేదెల పంపిణీని తిరిగి ప్రారంభించగా, ఇదే అదునుగా దళారులు గోల్‌మాల్ చేస్తున్నారు. కొందరు అధికారుల సహకారంతో పర్చేజ్ లేకుండా.. పంపిణీ లేకుండా సరికొత్త దందాకు తెరలేపారు. లబ్ధిదారులను వలలో వేసి బాగోతం నడిపిస్తున్నారు. 'ఈ స్కీం ద్వారా గేదెలను కొంటే 6 నుంచి 9 నెలల వరకు వాటికి మేత పెట్టి మేపాలి. అలా చేసినా ఈత తర్వాత మాత్రమే పాలు ఇచ్చే అవకాశం ఉంటుంది. అంత రిస్క్ తీసుకునే దానికంటే.. తాము చెప్పినట్టు వింటే ఇప్పటికిప్పుడు లాభపడొచ్చు' అని ఆశ చూపి వలలో వేస్తున్నారు. లబ్ధిదారుడికి కలిగే ప్రయోజనం కన్నా తమకే ఎక్కువగా ప్రయోజనం కలిగేలా చూసుకుంటున్నారు. ఈ పథకం ద్వారా ఒక్కో లబ్ధిదారుడికి ₹2లక్షల వరకు లబ్ధి కలుగనుండగా, కేవలం ₹35 వేల నుంచి ₹50 వేల వరకు వచ్చేలా చేస్తున్నారు. దీని వల్ల లక్ష్యం నెరవేరకపోగా, వల్ల లబ్ధిదారులు కూడా నష్టపోతున్నారు.



### ఫొటోలకే ఫోజులు.. పంపిణీ ఓ డ్రామా

..ఈ ఫొటోలో కనిపిస్తున్నవి హుజూరాబాద్ నుంచి మంథని మండలం గద్దలపల్లి గ్రామానికి తీసుకొచ్చిన గేదెలు. వాటిని కిందికి దింపి ఇక్కడ ఇద్దరు లబ్ధిదారులకు ఇచ్చినట్టు ఫొటోలు తీసి తిరిగి వాపస్ పంపించారు. తర్వాత లబ్ధిదారుడి ఖాతాలో డబ్బులు జమయ్యాయి. కానీ, లబ్ధిదారుడి ఇంటి వద్ద మాత్రం గేదెలు లేవు.

### సబ్సిడీ ఇలా..

2 మిల్చ్ ఆనిమల్ యూనిట్ కాస్ట్ ₹2 లక్షలు కాగా, ప్రభుత్వం ₹1.40 లక్షలు సబ్సిడీ ఇస్తున్నది. మిగతా ₹60 వేలు బ్యాంకు రుణంగా అందిస్తున్నది. ఈ యూనిట్‌ను 5 విభాగాలుగా చెల్లిస్తున్నారు. అందులో ఆనిమల్ కాస్ట్, ఇన్సూరెన్స్, రవాణా చార్జీలు, మెడిసిన్స్, ఫీడ్‌గా లబ్ధిదారులకు అందిస్తున్నారు.

### అంతా అడ్డదారే!

ప్రభుత్వం ఏర్పాటు చేసిన పర్చేజింగ్ కమిటీ ద్వారా లబ్ధిదారులు మేలు రకమైన పాడి గేదెలను ఎంపిక చేసుకోవాలి. వెటర్నరీ డాక్టర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అధికారి, బ్యాంకు రిప్రజంటేటివ్‌తో కలిసి లబ్ధిదారుడు తమిళనాడు, హర్యానా రాష్ట్రాలకు వెళ్లాలి. అక్కడ లొకేషన్‌లో గేదెను ఎంపిక చేసుకున్నట్టుగా ఫొటో దిగాలి. ఆ తర్వాత వాటిని తీసుకొని ఇక్కడకు రావాలి. వచ్చిన తర్వాత కూడా ఇంటి వద్ద ఫొటో దిగాలి. ఇలా చేసినప్పుడే ప్రభుత్వం బ్యాంకు ద్వారా నేరుగా చెల్లిస్తుంది. కానీ, ప్రస్తుతం పెద్దపల్లి జిల్లాలో అడ్డదారులు తొక్కుతున్నట్టు తెలుస్తున్నది. బ్రోకర్ల కనుసన్నల్లోనే దందా జరుగుతున్నట్టు వెలుగులోకి వస్తున్నది. నిజానికి కొంత మంది లబ్ధిదారులు నిబంధనల ప్రకారమే మేలు రకమైన గేదెలను కొనుగోలు చేసి తీసుకొస్తున్నా, మరికొంత మంది మాత్రం బ్రోకర్ల మాటలతో పక్కదారి పడుతున్నారు. గేదెల ఎంపిక కోసం తమిళనాడు లేదా హర్యానాకు వెళ్లి అక్కడి లొకేషన్‌లో ఫొటో దిగుతున్నా.. తర్వాత గేదెలు తెచ్చుకోవడం లేదు. ఒక బ్రోకర్ ద్వారా హుజూరాబాద్ నుంచి గేదెలను తెప్పించుకొని ఫొటోలు దిగి, ఆ తర్వాత అదే వాహనంలోనే గేదెలను పంపిస్తున్నట్టు తెలిసింది.


.. ఈ ఫొటోలో కనిపిస్తున్నది మంథని మండలం గోపాల్‌పూర్ గ్రామానికి పంపిణీ కోసం తీసుకువచ్చి తిరిగి తీసుకువెళ్తున్న గేదెలు. గ్రామంలో లబ్ధిదారుడికి ఇచ్చినట్టు ఫొటోలు తీసి తిరిగి అక్కడి నుంచి హుజురాబాద్‌కు తీసుకొని వెళ్లారు. తీరా లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి చూస్తే గేదెలు లేవు.

### పంపిణీ లేకుండానే..

జిల్లాలో 457 యూనిట్లను ఎంపిక చేయగా, 122 యూనిట్లకు గ్రౌండింగ్ జరిగింది. అయితే, ఈ గేదెల పంపిణీలో అంతా గోల్‌మాల్ జరుగుతున్నది. గేదెలను తెచ్చుకోకున్నా.. తెచ్చుకున్నట్టుగానే కథ నడుస్తున్నది. లబ్ధిదారుడు ₹90 వేలు ముట్టచెప్తే చాలు ఎవరికీ అనుమానం రాకుండా బాగోతం నడిపిస్తున్నట్టు తెలుస్తున్నది. ఇతర రాష్ట్రాలకు వెళ్లి వచ్చిన తర్వాత ఓ బ్రోకర్ ఒక వాహనంలో గేదెలను ఇంటికి తీసుకొచ్చి, ఇక్కడ పంపిణీ చేసినట్టు ఫొటోలు దిగిపిస్తాడు. ఆ తర్వాత ఆ గేదెలను అదే వాహనంలో తీసుకొని వెళ్తాడు. అంటే ఇక్కడ పర్చేజ్ లేదు.. పంపిణీ లేదు. లబ్ధిదారుడు స్కీం కింద ఎంపికై, ఆయనకు డబ్బులు ఖాతాల్లో జమైనా ఇంట్లో మాత్రం గేదెలు ఉండడం లేదు. పంపిణీ అంతా రికార్డుల్లోనే కనిపిస్తుండగా, బ్రోకర్ల దందాలో పెద్దమొత్తంలో డబ్బులు చేతులు మారుతున్నట్టు తెలుస్తున్నది. లబ్ధిదారుడికి వచ్చే ₹2 లక్షల్లో రూ.60 వేలు బ్యాంకు అప్పు పోను, మిగిలిన ₹90 వేలు మధ్యవర్తికి, అధికారులకు కలిపి ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. మిగతా ₹50 వేలలో స్థానికంగా గ్రామంలో యూనిట్ల ఎంపిక కోసం సహకరించిన బ్రోకర్లకు సైతం కొంత డబ్బును ఇస్తున్నట్టు తెలుస్తున్నది. ₹10 వేల నుంచి ₹15వేల వరకు ఇచ్చుకుంటే చివరాఖరుకు అసలైన లబ్ధిదారుడికి ₹30 వేల నుంచి ₹35 వేల వరకే మిగులుతున్నది.



### తీవ్ర విమర్శలు

2 మిల్చ్ ఆనిమల్ స్కీం ద్వారా ఎంపికైన లబ్ధిదారుడు ఆ తర్వాత ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మరో ఏ పథకం వచ్చినా ఐదేండ్ల వరకు ఎంపికయ్యే అవకాశం ఉండదు. అయితే, ఇక్కడ మిల్చ్ ఆనిమల్ స్కీం ద్వారా ₹2 లక్షలకు బదులుగా ₹30 వేల నుంచి ₹35 వేల వరకే ప్రయోజనం కలుగుతుంది. వాస్తవంగా చూస్తే లబ్ధిదారులు గేదెలను తీసుకొంటే ఉపాధి దొరుకుతుంది. రోజువారీగా వచ్చే డబ్బులతో కుటుంబానికి ప్రయోజనం కలుగుతుంది. కానీ, ఈ పథకం ఇలా దుర్వినియోగం కావడం వల్ల అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. బ్రోకర్లు సాగిస్తున్న ఈ దందాలో అధికారుల పాత్ర ఉందనే ఆరోపణలు వస్తున్నాయి. ఇదంతా కండ్ల ముందే జరుగుతున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### అక్రమాలకు తావులేకుండా పంపిణీ చేస్తున్నాం

2మిల్చ్ ఎనిమల్ యూనిట్ల పంపిణీలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పంపిణీ చేస్తున్నాం. పూర్తిగా లబ్ధిదారులకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడా అక్రమాలు జరిగినట్టు నా దృష్టికి రాలేదు. ఏవైనా దృష్టికి వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

-కే నరేందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ (పెద్దపల్లి)


సిరిసిల్లలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జిందం చక్రపాణి, ఆకునూరి శంకరయ్య

# అపరభగీరథుడు కేసీఆర్

- కాళేశ్వరంతో రాష్ట్రం సస్యశ్యామలం
- బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 18 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణకు అపరభగీరథుడు అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేశారని కొనియాడారు. ఈ మేరకు మంగళవారం సిరిసిల్లలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి చెప్పిన మాటలే మళ్లీ చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో జిల్లాకు సాగునీరు అందడంలేదని చేసిన వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. మండుటెండల్లోనూ కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి మల్లన్నసాగర్, రంగనాయకసాగర్ ప్రాజెక్టుల నుంచి కూడెల్లి వాగు ద్వారా ఎగువ మానేరుకు చేరుకుని, అక్కడ అలుగుదుంకిన నీరు సిరిసిల్ల మానేరు బ్రిడ్జి కిందకి వచ్చాయని తెలిపారు. మేడిగడ్డ బ్యారేజీలో కుంగిన బ్లాక్‌ను మరమ్మతు చేయకుండా కేసీఆర్‌ను బదనాం చేయాలని కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. అత్యంత నీచమైన భాషను మాట్లాడే రేవంత్ రెడ్డి నోరు మూసీ నది కంటే మురికిగా ఉంటుందన్నారు. వేములవాడ గుడి చెరువుకు 30 ఎకరాలు సేకరించి లిఫ్ట్ తెచ్చిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. ఒకప్పుడు ఉరిశాలగా ఉన్న సిరిసిల్ల నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిపిన గొప్ప నాయకుడు కేటీఆర్ అని అభివర్ణించారు. మిడ్ మానేరు ప్రాజెక్టును పూర్తి చేసి తంగళ్లపల్లి బ్రిడ్జి కిందకు నీళ్లు తెచ్చి ప్రజల రుణం తీర్చుకున్నారని పేర్కొన్నారు. తంగళ్లపల్లి నుంచి ఇల్లంతకుంట వరకు సాగు నీటిని అందించారన్నారు. 'రంగనాయకసాగర్ చార్ సౌ బీస్ రేవంత్‌రెడ్డి బాపు నిర్మించిండా?' అని ప్రశ్నించారు. మునిగిపోవడానికి సిద్ధంగా ఉన్న పార్టీ నాయకుడు కేకే మహేందర్‌రెడ్డి విమర్శలు చేసే ముందు పునరాలోచన చేసుకోవాలని హితవుపలికారు. ప్రజలకు కాంగ్రెస్‌పై విశ్వాసం పోయిందని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కేసీఆర్ సీఎం కావాలని కోరుకుంటున్నారన్నారు. సాగు నీరు లేక ఇబ్బందులు పడుతున్న రైతుల సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, నాయకులు గజభీంకార్ రాజన్న, వెంగళ శ్రీనివాస్, కుంభాల మల్లారెడ్డి, కొండ శంకర్, పోచవేని ఎల్లయ్యయాదవ్, బింగి ఇజ్జగిరి పాల్గొన్నారు.

# యూరియా నోస్టాక్


తిమ్మాపూర్: పోలంపల్లిలో యూరియా కోసం రైతుల బారులు


మన్నెంపల్లిలో..

- అదనులో కొరత.. రైతుల అవస్థలు
- బారులు తీరి నిల్చున్నా సగం మందికే పంపిణీ

తిమ్మాపూర్‌రూరల్/ మానకొండూర్‌రూరల్ ఫిబ్రవరి 18 : యాసంగి పొలాలు ప్రస్తుతం కలుపు దశలో ఉన్నాయి. రైతులు కలుపుతీత పనుల్లో బిజీగా ఉన్నారు. కలుపు తీసిన వెంటనే యూరియా వేస్తే పంట బాగా ఎదుగుతుంది. అయితే, ఇదే సమయంలో అధికారుల ప్రణాళికా లోపంతో యూరియా కొరత వేధిస్తున్నది. గతంలో ఎన్నడూ లేని విధంగా సహకార సంఘాల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేస్తున్నారు. తిమ్మాపూర్ మండలంలోని పోలంపల్లిలోని దుద్దెనపల్లి, మన్నెంపల్లిలోని పోరండ్ల, మానకొండూర్ మండలంలోని కొండపల్కల, గంగిపల్లి గ్రామాల్లోని ప్రాథమిక సహకార సంఘాలలో మంగళవారం యూరియా కోసం రైతులు ఉదయం 6 గంటల నుంచే బారులు తీరారు. తిమ్మాపూర్ మండలంలోని సొసైటీలకు 230 చొప్పున బస్తాలు మాత్రమే రాగా, రైతులు పెద్ద సంఖ్యలో రావడంతో సగం మందికే అందాయి. దీంతో చాలా మంది రైతులు నిరాశగా వెనుదిరిగారు. కొంత మంది రైతులు యూరియా కోసం సొసైటీల ఎదుట ఆందోళన చేశారు. గతంలో రైతులకు సరిపడా నిల్వలు ఉండేవని, ప్రస్తుతం యూరియా తెప్పించడంలో నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మార్చికి ముందే ఎండలు



ఎండలు అప్పుడే మొదలయ్యాయి. మార్చికి ముందు నుంచే ప్రతాపం చూపుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలకు చేరువవుతున్నాయి. మధ్యాహ్నం వేళ రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ప్రజలు ఇండ్ల నుంచి బయటికి వెళ్లాలంటే ఆలోచిస్తున్నారు. రక్షణ కవచాలను ధరిస్తున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్






వెలవెలబోతున్న బస్టాండ్ సర్కిల్ ఏరియా